సాక్షి
అనకాపల్లి

సోమవారం । 1 । జనవరి । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు నిర్వహించారు. స్వర్ణసంపెంగ పుష్పాలతో పూజ చేశారు.



సిరుల తల్లికి విశేష పూజలు

డాబాగార్డెన్స్ : విశాఖలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: బొర్రా గుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. గోస్తనీ అందాలను తిలకించేందుకు ఆసక్తి చూపారు.

న్యూస్‌రీల్

నేటి స్పందన రద్దు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని ఈ సోమవారం రద్దు చేస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అర్జీదారులు ఎవరూ కలెక్టరేట్‌కి రావద్దని ఆయన సూచించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు : ఏఎస్పీ



కోటవురట్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ

కోటవురట్ల: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఆక్సాహేబుపేట, విశ్వనాథపురం, లింగాపురం జంక్షన్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గంజాయి రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఏఎస్పీ వెంట నక్కపల్లి సీఐ అప్పన్న, స్థానిక ఎస్‌ఐ నారాయణరావు ఉన్నారు.

యలమంచిలి ఎస్‌ఐకు కలెక్టర్,ఎస్పీ ప్రశంస



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు

యలమంచిలి రూరల్: పట్టణ ఎస్‌ఐ కె.పాపినాయుడు గత ఏడాదిలో మెరుగైన పనితీరును కనబరిచినందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రశంసించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణల నుంచి రెండు ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు ఎస్‌ఐ పాపినాయుడు ఆదివారం తెలిపారు. త్వరితగతిన కేసుల దర్యాప్తు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసేవారిపై ఎక్కువ కేసులు నమోదు చేసినందుకు రెండు అవార్డులు లభించినట్టు చెప్పారు. ఎస్‌ఐని సీఐ షేక్ గఫూర్ అభినందించారు.



న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా అనకాపల్లి శారద నగర్ కాలనీలో లెమన్‌స్పూన్ ఆడుతున్న మహిళలు



యలమంచిలి తులసీనగర్‌లో న్యూ ఇయర్ వేడుకలు



అనకాపల్లిలో పిల్లల కేరింతలు

వినూత్న స్వాగతం



మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నెయ్యిదొండ గోపాల్ నూతన సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలికారు. పెన్సిల్ ముల్లు మీద 2024 ఆకారాన్ని చెక్కి ప్రతిభ చాటుకున్నారు. దీనిని చెక్కేందుకు 3 గంటల సమయం పట్టిందని గోపాల్ ఆదివారం తెలిపారు. ఆయన ఎం.కోడూరు సచివాలయంలో గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నారు.

నూతనోత్సాహం



విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ..

సాక్షి, అనకాపల్లి : ఆంగ్ల నూతన సంవత్సరానికి కోటి ఆశలతో జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. 2023కు వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే జరగాలని ఆశిస్తూ '2024'ను సాదరంగా ఆహ్వానించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి మొదలుకుని సోమవారం తెల్లవారుజాము వరకు జిల్లా అంతటా ఎటుచూసినా న్యూ ఇయర్ సంబరాలు కొనసాగాయి. యువత హడావుడికి అంతు లేకుండా పోయింది. సంబరాలు మిన్నంటాయి. యువతీ, యువకులు సరిగ్గా రాత్రి 12 గంటలు కాగానే ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో పండ్లు, పూలు, స్వీట్ల దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఇళ్లముంగిట మహిళలు 'హ్యాపీ న్యూఇయర్'ను రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: నూతన సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో సుభిక్షంగా జీవించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశానికే తలమానికంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ప్రజలందరిపై భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు.

సుఖ సంతోషాలతో ఉండాలి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సాక్షి, అనకాపల్లి: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. 2023లో జిల్లా యంత్రాంగం నుంచి జిల్లా ప్రజలకు ఎన్నో రకాల ఉత్తమ సేవలు అందాయని, ఈ కొత్త ఏడాదిలో అంతకుమించి ఉత్తమమైన సేవలు అందుతాయని తెలిపారు. ఉద్యోగులు, ప్రజలు వారి లక్ష్యాలు సాధించేందుకు, మరెన్నో మైలురాళ్లు దాటేందుకు 2024 సంవత్సరం వేదిక కావాలని ఆకాంక్షించారు.

ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: నియోజకవర్గంలో గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడూ జరగనంత అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. చోడవరం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో అంతా ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ, అభివృద్ధి పనులకు నియోజకవర్గంలో రూ.1,887 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. సంక్షేమానికి రూ. 1,087 కోట్లు, అభివృద్ధికి రూ.800 కోట్లు ఖర్చుచేసినట్టు తెలిపారు. గ్రామాలను అనుసంధానంచేస్తూ పలు రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. గత టీడీపీ హయాంలో ప్రధాన అంతర్గత రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. నూతన సంవత్సరంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రజలంతా సహకారం అందించాలని ధర్మశ్రీ కోరారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

కెవ్వు 'కేక్'

న్యూ ఇయర్‌కు ప్రత్యేక ఆఫర్లతో అమ్మకాలు



యలమంచిలిలో ఓ బేకరీ వద్ద అమ్మకానికి సిద్ధం చేసిన వివిధ రకాల కేక్‌లు

యలమంచిలి రూరల్: న్యూ ఇయర్ వేడుకంటే తప్పనిసరిగా కేక్ ఉండాల్సిందే అంటారు ఎక్కువమంది. డిసెంబరు 31వ తేదీ రాత్రి 12 గంటల సమయం కాగానే కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, అడ్డురోడ్డు సహా అన్ని మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో కేక్‌లకు భలే డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో ఈ రెండ్రోజుల్లోనే సుమారు అరకోటి రూపాయలవరకూ కేక్‌ల వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

వివిధ ఆకృతుల్లో ..

న్యూ ఇయర్ సందర్భంగా బేకరీలు ప్రత్యేకమైన కేక్‌లను తయారుచేస్తున్నాయి. వివిధ రకాల ఆకృతుల్లో తయారుచేయడంతో పాటు రుచిలో కూడా ఆహా అనిపిస్తున్నాయి. కేక్‌లు పలు ఫ్లేవర్లలో అందుబాటులో ఉన్నాయి. అర కిలో కేక్ రూ.150, కిలో కేక్ రూ.250, వివిధ రకాల ఫ్లేవర్ల కేక్‌లు రూ.300, రూ.350కు, కూల్ కేక్‌లు రూ.450 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు కొన్ని బేకరీలు, స్వీటు దుకాణాల యజమానులు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. వ్యాపారుల్లో నెలకొన్న పోటీ కారణంగా ఒక కేజీ కేక్ కొంటే కూల్ డ్రింక్ ఫ్రీ, కేజీపై రూ.50 తగ్గింపు, రెండు కేజీలు కొంటే 10శాతం డిస్కౌంట్ ఇలా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు.



సీతాకోక చిలుక ఆకారంలో..

ఆరోగ్య సురక్ష.. కళ్లకు రక్ష

కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామ రక్షగా మారింది. సురక్ష శిబిరాల వద్దే ప్రత్యేక కంటి వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో దృష్టి సమస్యలున్న వారు వైద్యం పొంది, ఇప్పుడు ఆనందంగా ఉన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రభుత్వం సిద్ధమైంది. మరోవైపు నేత్ర సమస్యలపై వైద్య సేవల్ని నిరంతరం అందిస్తామని వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది.

- ప్రత్యేక శిబిరాల్లో 42 వేల మందికి కంటి పరీక్షలు
- 757 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు పూర్తి
- రాష్ట్రంలో అనకాపల్లి జిల్లాకు మొదటి స్థానం

నక్కపల్లి: కంటి చూపు సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సాధారణ వైద్య పరీక్షలతోపాటు, ప్రత్యేకంగా కంటి పరీక్షల శిబిరాలను ఏర్పాటు చేసింది. గత సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 12 వరకు జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించడంలో అనకాపల్లి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

గ్రామీణులకు 'కంటి వెలుగు'

రాష్ట్ర వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడే వారి కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని అమల్లోకి తెచ్చింది. కంటి సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రులకు వెళ్లలేని వారికోసం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ వైద్య శిబిరాల్లో బీపీ, సుగర్, రక్త పరీక్షలు, యూరిన్, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, క్షయ తదితర తొమ్మిది రకాల పరీక్షలతోపాటు కంటి సమస్యలతో బాధపడేవారిని గుర్తించేందుకు నేత్ర వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించింది. ఆప్తాలమిక్ సిబ్బంది ద్వారా బాధితులను గుర్తించింది. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 460 శిబిరాలు నిర్వహించి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 1,73,676 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో కంటి సమస్యలతో బాధపడేవారే 41,922 మంది ఉన్నారు. వీరిలో 13,748 మందికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. మిగిలిన వారిలో క్యాటరాక్ట్ సర్జరీలు అవసరమైన వారికి నిర్వహించి, మిగిలిన వారికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు.



జగనన్న ఆరోగ్య సురక్షలో పరీక్షలు చేయించుకున్నవారికి కళ్లద్దాలు అందజేస్తున్న రమణకుమార్


క్యాటరాక్ట్ సర్జరీల్లో జిల్లా టాప్

రాష్ట్రంలో క్యాటరాక్ట్ ఆపరేషన్లలో అనకాపల్లి జిల్లా మొదటి స్థానంలో ఉంది. క్యాటరాక్ట్ ఆపరేషన్లను జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రులతోపాటు, మరో 5 ఎన్‌జీవో కంటి ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్నారు. జనవరి నుంచి రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభానికి ముందే గుర్తించిన వారందరికీ ఆపరేషన్లు, కళ్లద్దాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు తెలిపారు. మొత్తం మీద కంటి సమస్యలతో బాధపడేవారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంలా మారింది.

జిల్లాలో వివరాలు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు	460
వైద్య సేవలందుకున్న ప్రజలు	1,73,676
కంటి సమస్యలున్నవారు	41,922
క్యాటరాక్ట్ రోగులు	2,086
కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు	757
ఇతర శస్త్రచికిత్సలకు ఎంపికైన వారు	247
ఇతర శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు	61
కళ్లద్దాలు అవసరమైన వారు	23,211
కళ్లద్దాలు పంపిణీ	915

ఇది నిరంతర ప్రక్రియ



జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి సమస్యలతో బాధపడేవారి కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాం. చాలా మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఆస్పత్రి వరకు రాకుండానే వైద్య పరీక్షలు చేసి, సమస్యను గుర్తించి, మందులు అందించాం. ఇతర వైద్యానికి సిఫార్సు చేశాం. ఇప్పటి వరకు 757 మందికి శస్త్ర చికిత్సలు చేయించాం. 915 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశాం. క్యాటరాక్ట్ ఆపరేషన్లలో జిల్లా మొదటి స్థానంలో ఉంది. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తొలి విడత సురక్ష శిబిరాల్లో గుర్తించిన వారందరికీ ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

–డాక్టర్ రమణకుమార్, ప్రోగ్రాం అధికారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

‘అమృత్ భారత్’.. వచ్చేసింది

- వాల్తేరు డివిజన్‌లోకి స్వాగతం పలికిన స్పీకర్ తమ్మినేని
- ఆధునిక వసతులతో ఆకట్టుకున్న సామాన్యుల ఎక్స్‌ప్రెస్



అమృత్ భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: సామాన్యుల సూపర్‌ఫాస్ట్ రైలుగా చెప్పుకునే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వాల్తేరు డివిజన్‌లో పట్టాలపై పరుగులు పెట్టింది. ఆదివారం 12.45 గంటలకు వాల్తేరు డివిజన్ ప్రాంతమైన శ్రీకాకుళం రోడ్డు జంక్షన్‌కు చేరిన ఈ రైలుకు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎంపీ రామ్మోహన్ నాయుడు ఘన స్వాగతం పలికారు. భారత్‌లో సూపర్‌ఫాస్ట్ అంటే వందే భారత్ ఎక్స్‌ప్రెస్. అయితే ఈ రైలులో ప్రయాణం చాలా ఖరీదు. దీంతో సామాన్యులు ఈ రైలు ఎక్కేందుకు ఆసక్తి కనబరచడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని భారతీయ రైల్వే అదే స్పీడ్. అదే సౌకర్యాలను సామాన్య ప్రయాణికులకు అందించాలని అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ పేరుతో పట్టాలెక్కించింది. స్పీడ్‌లో గానీ, సౌకర్యాల్లో గానీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ రైలు ఏ మాత్రం తీసిపోదు. అయితే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఫుల్ ఏసీ బోగీలతో నడిస్తే అమృత్ ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీల బోగీలతో నడుస్తుంది. సులభంగా చెప్పాలంటే అత్యంత స్పీడ్‌తో అత్యాధునిక సౌకర్యాలతో నడిచే పాసింజర్ రైలే ఈ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్. 22 బోగీలతో నడిచే ఈ రైళ్ల(రెండు రైళ్లు)ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించడం తెలిసిందే.

సౌకర్యాలు ఇవే..

వందే భారత్ రైలు మాదిరిగానే ఈ రైలు కూడా 130 కిలోమీటర్ల స్పీడ్‌తో నడుస్తుంది. అత్యాధునిక మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, మొబైల్స్ పెట్టుకునేందుకు ప్రత్యేకంగా చార్జింగ్ పాయింట్లు, వాటర్ బాటిళ్ల కోసం ఫోల్డబుల్ బాటిల్ హోల్డర్స్, మెరుగైన లగేజీ రాక్, ఎల్‌ఈడీ లైట్లు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఎర్గోనామిక్‌గా డిజైన్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి బోగీలో ఒక వెస్ట్రన్‌తో పాటు మూడు ఇండియన్ స్టైల్ టాయిలెట్స్, కాళ్లతో ఆపరేట్ చేసే వాటర్ ట్యాప్‌లు ఉన్నాయి. 1834 మంది పాసింజర్లను తీసుకొని వెళ్లగలిగే ఈ రైలు మొత్తం 22 బోగీలో నడుస్తుంది. 12 స్లీపర్ క్లాసులు, 2 రిజర్వ్‌డ్ స్లీపర్ క్లాసులు, 8 సాధారణ పాసింజర్ బోగీలు ఉన్నాయి.

కుదుపుల్లేని ప్రయాణం

అత్యధిక స్పీడ్‌తో నడిచే రైలు కావడంతో కుదుపులు లేకుండా ఉండేందుకు తొలిసారిగా పుష్ అండ్ పుల్ రాక్ విధానంలో బోగీలను రూపొందించారు. దీని వల్ల కుదుపులు లేకుండా రైలు ప్రయాణించడంతో పాటు బోగీలు తప్పిపోకుండా భద్రత కూడా ఉంటుంది. ఈ రైలు 13434 నంబరుతో వారానికి ఒక్క రోజు మాల్దా టౌన్ నుంచి బెంగళూరు ప్రయాణిస్తుంది. మాల్దా టౌన్‌లో ఉదయం 8.50 గంటలకు బయలుదేరి మరోసటి రోజు ఉదయం 3 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మళ్లీ 13233 నంబరుతో బెంగళూరు నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.



బెలూన్లతో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

అడుగడుగునా ఘన స్వాగతం

మాల్దా టౌన్ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగిన ప్రతి స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. స్కూల్, కాలేజీ విద్యార్థులు కరతాల ధ్వనులతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని రైల్వే స్టేషన్లలో రైలుకు స్వాగతం చెప్పారు.



రైలులో తల్లిదండ్రులతో కలిసి ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

సామాన్యులకు వరం..



దూర ప్రయాణాలు చేసే సామాన్యులకు ఈ రైలు ఒక వరం అని చెప్పాలి. అతి తక్కువ ఖర్చుతో వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఈ అమృత్ రైలు కలిగిస్తుంది. దీని వల్ల డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. సౌకర్యాలు చాలా బాగున్నాయి.

– ఆర్.లక్ష్మి, ప్రయాణికురాలు, అక్కయ్యపాలెం

భద్రత.. సౌకర్యాలు



నాన్ ఏసీ రైలు అయినా సీసీ టీవీలు ఉండడంతో ప్రయాణికులకు ఎంతో భద్రత ఉంటుంది. వందే భారత్ రైలులో ఉండే సౌకర్యాలన్నీ ఈ రైలులో ఉన్నాయి. టాయిలెట్స్ చాలా అధునాతనంగా ఉన్నాయి. బెర్త్‌లు, మొబైల్ చార్జింగ్ పాయింట్స్ ఎంతో సౌకర్యవంతం కానున్నాయి.

– వి.సిరిభువన, ప్రయాణికురాలు, విశాఖపట్నం

సీఎం జగన్ పాలనలో ప్రజలకు మరింత మంచి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆకాంక్ష



న్యూ ఇయర్ కేకును విద్యార్థినులకు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ పాలనలో మరింత మంచి జరుగుతుందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేసి విద్యార్థినులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. మాడుగుల నియోజకవర్గం ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం వసతిగృహాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్ వేచలపు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మరో 9 మందికి కరోనా

మహారాణిపేట(విశాఖ): విశాఖలో ఆదివారం మరో 9 మందికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 140 మందికి పరీక్షలు చేయగా, వీరిలో 9 మందికి కరోనా నిర్ధారణ అయింది. 12 మంది హోమ్ ఐసోలేషన్‌లోను, ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. 11 మంది డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 28 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

దంపతులపై దాడి



దాడిలో గాయపడిన దంపతులు

యలమంచిలి రూరల్: వ్యక్తిగత దూషణలతో క్షణికావేశానికి గురైన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు పొరుగునున్న దంపతులపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని పులపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు,వైద్య సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం పులపర్తి బీసీ కాలనీ రైస్ మిల్లు పక్కన నివాసముంటున్న దంపతులు పెద్దాడ బేబీ,భర్త కల్యాణ్,సమీపంలో నివాసముంటున్న మరో కుటుంబానికి ఆదివారం ఉదయం స్వల్ప వివాదం ఏర్పడింది. తన ద్విచక్రవాహనం తాళాన్ని ఎవరో విరగ్గొట్టారంటూ బేబీ తిట్టుకుంటుండగా తమనే దూషిస్తున్నారనుకుని ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు కర్రలతో తమపై దాడి చేశారని బేబీ ఆరోపిస్తోంది. తన భర్తను కూడా ముగ్గురూ ఇష్టానుసారంగా కొట్టారని తెలిపింది. ఈ దాడిలో బేబీ కుడి చేయిపై తీవ్ర గాయమైంది. 15 కుట్లు వేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఆమె భర్త కల్యాణ్‌కు కూడా ప్రథమ చికిత్స అందజేశారు. అయితే ఆరోపణలెదుర్కొంటున్న కుటుంబం కూడా బేబీ, ఆమె భర్త తమపై దాడి చేశారని ఆరోపిస్తూ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. ఇరు కుటుంబాల వారు యలమంచిలి రూరల్ పోలీసులను ఆశ్రయించారు.

రేపటి నుంచి వడ్డాది డైవర్షన్ రోడ్డుపై రాకపోకలు



ఇటీవల మిచాంగ్ తుపాన్‌కు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డు



డైవర్షన్ రోడ్డు వద్ద జరుగుతున్న పనులు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుఫాన్ భారీ వర్షానికి డైవర్షన్ రోడ్డుపై నుంచి పెద్దేరు నీరు ప్రవహించింది. నీటి ఉధృతికి ఈ రోడ్డు కోతకు గురైంది. దీంతో నర్సీపట్నం, చోడవరం, విశాఖ, పాడేరు, కాకినాడ తదితర మార్గాల్లో ఆర్టీసీ బస్సుల తోపాటు భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వడ్డాది డైవర్షన్ రోడ్డు పనులు చేస్తుండగానే విజయరామరాజుపేట వద్ద వందేళ్ల క్రితం నిర్మించిన తాచేరు వంతెన కూలిపోయింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ముందుగా విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు సాగేలా చేశారు. ప్రస్తుతం వడ్డాదిలో కోతకు గురైన డైవర్షన్ రోడ్డు వద్ద రాయి, ఇసుక, గ్రావెల్ వేసి లెవెలింగ్ పనులు చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నానికి ఈ పనులు పూర్తి చేసి సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించడానికి చర్యలు చేపట్టారు. ముందుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు రాకపోకలకు అనుమతిస్తారు. సంక్రాంతి పండగ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలింపు నేపథ్యంలో వాహనాల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందని డైవర్షన్ రోడ్డు, వంతెన పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కశింకోట: మండల కేంద్రం కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్టు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్లే రోడ్డులో నడిచి వెళుతున్న అనకాపల్లిలోని కోట్ని వీధికి చెందిన బత్తుల సత్యనారాయణ(73)ను శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మేనకోడలు కొల్లేటి దేవి భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అయోధ్య అక్షింతలతో వైభవంగా శోభాయాత్ర



అక్షింతలతో శోభాయాత్రలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో మండల కేంద్రం దేవరాపల్లిలో ఆదివారం వైభవంగా శోభాయాత్రను నిర్వహించారు. మహిళల కోలాటం మధ్య ఈ యాత్ర సాగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డిప్యూటీ సీఎంను శ్రీరామ భక్తులు, ప్రజాప్రతినిధులు, అయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి చేతులు మీదుగా ఈ అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలకు అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అక్షింతలతో కూడిన కలశాన్ని తలపై పెట్టుకుని ప్రధాన రహదారి మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, అయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.సింహాచలం నాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, కె.వి.రమణ, భీమవరపు కోటేశ్వరరావు, కొరుపోలు శ్రీను, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముక్ స్వామినాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, పోతల శంకరరావు, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, చింతల సత్య వెంకటరమణ, టోకురి రామకృష్ణ, ఎంపీటీసీలు మొల్లి కృష్ణమూర్తి, పోతల వెంకటరావు తదితర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అవంతి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

మాకవరపాలెం: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా స్థాయి ఇంటర్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ పోటీల్లో మండలంలోని తామరంలో అవంతి కళాశాల నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బ్యాడ్మింటన్ పోటీల్లో చుక్కల ప్రసాద్, రాహుల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఏవో డానియల్‌రాజ్, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

ఖండివరంలో అతిసార

- వారం రోజుల్లో 20 మందికి వాంతులు, విరేచనాలు
- మాడుగుల సీహెచ్‌సీలో ఆరుగురికి చికిత్స



మృతుడు సత్తిబాబు(ఫైల్)

చీడికాడ: మండలంలోని ఖండివరంలో అతిసార విజృంభిస్తోంది. రోజుకు ఒకరిద్దరు చొప్పున మాడుగుల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన ఇ.ఈశ్వరమ్మ, వై.గంగునాయుడు, శీరంరెడ్డి శ్రీరామమూర్తి, ఎం.దేముడమ్మ, ఎస్.సన్యాసమ్మ, పి.కన్నమ్మ చికిత్స నిమిత్తం చేరారు. మరోవైపు గ్రామానికి చెందిన నేమాల సత్తిబాబు(60)వాంతులు, విరేచనాలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే మాడుగుల సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లకుండా మాడుగులలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థతి విషమించడంతో గ్రామానికి తీసుకొచ్చిన తర్వాత మృతి చెందినట్లు అతని కుమారుడు కన్నంనాయుడు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న చీడికాడ వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సేవలందిస్తున్నా అతిసారం అదుపులోకి రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

14న గోదాదేవి కల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన కొండదిగువ వేంటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14న భోగి రోజు గోదా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఆదివారం నుంచి టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకునే భక్తులు www.aptemples.ap.gov.in ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. అలాగే నేరుగా టికెట్లు తీసుకునే భక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రదించాలని కోరారు. టికెట్టు రూ.1000లని తెలిపారు.

గంజాయి కేసులో మరొకరికి రిమాండ్

యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించి భద్రపరిచిన గంజాయి చోరీకి పాల్పడిన కేసులో మరో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈస్ట్ గంగవరానికి చెందిన ఉయ్యాల శ్రీనివాసరావును 9వ నిందితుడిగా ఈ కేసులో యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాసరావుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.ఈ మేరకు నిందితుడ్ని యలమంచిలి రూరల్ పోలీసులు విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదే కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి విశాఖ సెంట్రల్ ప్రిజన్‌కు రిమాండుకు, ఇద్దరు మైనర్లను జువెనైల్‌హోంకు ఇప్పటికే తరలించారు. యలమంచిలి పట్టణానికి చెందిన మరో నిందితుడు కార్తీక్ పరారీలో ఉన్నాడు.అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పింఛన్ల పండగ.. ఆనందం నిండుగ

మాట తప్పని.. మడమ తిప్పని నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారు. ఈ పెంపు మేరకు పింఛన్‌ను ఈరోజు పంపిణీ చేయనున్నారు. వృద్ధులకు, వితంతువులకు మరింత భరోసా అందించనున్నారు.

- నేడే పెంచిన పెన్షన్ల పంపిణీ
- అనకాపల్లి జోన్‌లో 10,084 మందికి లబ్ధి
- రూ.3 వేలు అందుకోనున్న లబ్ధిదారులు


నరసింగరావుపేటలో పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత(ఫైల్)

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్ల పెంపులో ఇచ్చిన మాటను శతశాతం అమల్లోకి తెచ్చింది. గత ప్రభుత్వం మాదిరి మోసపూరిత హామీలు కావని, సీఎం జగన్ మాటిచ్చాడంటే.. చేస్తాడంతే.. అంటూ లబ్ధిదారులు వేనోళ్ల పొగుడుతున్నారు. రూ.2 వేలు నుంచి రూ.3 వేలుకు పెంచుకుంటూ వెళ్తామన్న హామీ కొత్త సంవత్సరం మొదటి రోజునే అమల్లోకి రానుంది.

ముందే వచ్చిన సంక్రాంతి

ఒకప్పుడు పింఛన్ పొందాలంటే తిప్పలు తప్పేవి కావు. ఎపుడిస్తారో.. ఎంతిస్తారో..కూడా తెలియని పరిస్థితి. కొత్తగా పింఛన్‌కు అర్హత దక్కాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. సీఎం జగన్ పాలనలో అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, పలు పింఛన్లకు అర్హులైన అనారోగ్య పీడితులు తమ ఇంటి గుమ్మం దాటకుండానే పింఛన్ అందుకుంటున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ నగదు అందిస్తున్నారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని ఐదు వార్డుల్లో 10,084 మంది లబ్ధిదారులు పింఛన్లు అందుకుంటున్నారు. వీరిలో వృద్ధులు, వితంతువులకు ఈ నెల నుంచి రూ.3 వేలు చొప్పున పింఛన్ అందనుంది. దీంతో వీరందరికీ ఈ ఏడాది సంక్రాంతి రెండు వారాల ముందే వచ్చినట్టయింది.

అనకాపల్లి జోన్‌లో లబ్ధిదారులు

వార్డు	పింఛన్లు	వార్డు	పింఛన్లు
80	2,717	82	1,842
81	1,530	83	2,117
		84	1,878

కనకదుర్గకు పసుపుకొమ్ముల పూజ


పూజ చేసిన పసుపుకొమ్ములతో కనకదుర్గమ్మ

అనకాపల్లి: గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి పసుపుకొమ్ముల పూజ నేత్రపర్వంగా జరిగింది. శ్రీ గంగపరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో పొలిమేర ఓంకార్, సుష్మ దంపతులు 3 లక్షల 60 వేల పసుపు కొమ్ములతో లక్ష్మీపూజ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కాండ్రేగుల శ్రీరాం, మద్దాల శ్రీను, కె.సుబ్బు, కె.వెంకట్, బి.వర, వి.మహేష్, కె.సాంబ, బి.గంగాధర్, డి.కుమార్, కె.శంకరరావు, ఎం.నగేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కమిటీల నియామకం


మందపాటి జానకీరామరాజు (పట్టణ అధ్యక్షుడు)


పెదిశెట్టి గోవిందు (మండల అధ్యక్షుడు)


మలసాల కిషోర్ (కశింకోట మండల అధ్యక్షుడు)


కొణతాల సంతోష్ అప్పలనాయుడు (పట్టణ ఉపాధ్యక్షుడు)


మద్దాల రమణబాబు (పట్టణ ఉపాధ్యక్షుడు)


నోట్ల వాసు (అనకాపల్లి మండల ఉపాధ్యక్షుడు)


రాపేటి వెంకటేశ్వరరావు (అనకాపల్లి మండల ఉపాధ్యక్షుడు)


పెంటకోట శ్రీనివాసరావు (కశింకోట ఉపాధ్యక్షుడు)


బొట్టా రాజారావు (కశింకోట మండల ఉపాధ్యక్షుడు)

తుమ్మపాల/కశింకోట: అనకాపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో జాబితాను విడుదల చేసింది. పార్టీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడిగా మందపాటి జానకీరామ రాజు, ఉపాధ్యక్షులుగా కొణతాల సంతోష్ అప్పలనాయుడు, మద్దాల రమణబాబు, అనకాపల్లి మండల అధ్యక్షుడిగా పెదిశెట్టి గోవిందు, ఉపాధ్యక్షులుగా నోట్ల వాసు, రాపేటి వెంకటేశ్వరరావు, కశింకోట మండల అధ్యక్షుడిగా మలసాల కిషోర్, ఉపాధ్యక్షులుగా పెంటకోట శ్రీనివాసరావు, బొట్టా రాజారావుతో పాటు, ఇతర కార్యవర్గాన్ని నియమిస్తూ ఆ ప్రకటనలో పేర్కొంది.

ఎస్ఎస్‌సీ జీడీ, సీఆర్పీఎఫ్ పరీక్షలకు శిక్షణ

తుమ్మపాల: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌లు ఉచితంగా అందిస్తున్నట్లు హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. సాయుధ బలగాల నియామకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 26 వేలకుపైగా కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపింది. 5న హిమశేఖర్ కళాశాలలో మరోసారి అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. శిక్షణతోపాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించనున్నట్లు పేర్కొంది. వివరాలకు 7337585959, 9000797789 నంబర్లను సంప్రదించాలని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

కోటి ఆశలతో.. కొత్త సంవత్సరానికి..


నెహ్రూచౌక్‌లో అమ్మకానికి ఉంచిన పూలబొకేలు

గత సంవత్సరపు ఆనందాలు రెట్టింపు కావాలి. చేదు జ్ఞాపకాలు మరుగునపడాలి. నూతన సంవత్సరం కొత్త ఆనందాలకు, అంతకు మించిన విజయాలకు నిలయం కావాలి. ఇదే ఆకాంక్షతో ఊరూవాడా వేడుకలు ప్రారంభించారు. అర్ధరాత్రి నుంచే నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు.


ఏఎంఏఎల్ కళాశాల న్యూయర్ వేడుకల్లో మాట్లాడుతున్న విజయబాబు


డైట్ కళాశాల కేక్ కట్ చేస్తున్న రత్నాకర్


కశింకోటలో విద్యుద్దీపాలతో ముస్తాబు చేసిన ఆంధ్ర కల్వరీ బాప్టిస్టు సెంటినరీ చర్చి

అనకాపల్లి: పట్టణం నూతన సంవత్సర ఆగమన శోభ సంతరించుకుంది. 2023కు వీడ్కోలు చెబుతూ 2024కు స్వాగతం పలికేందుకు మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. నూతన సంవత్సరం సందర్భంగా రంగులమ్మే దుకాణాలు, కేక్ షాపులు, బిర్యానీ అమ్మకం దారులతో ప్రధాన రోడ్లు కళకళలాడాయి. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పూలబొకేలు కొత్త కొత్త ఆకృతుల్లో తయారు చేయడంలో వ్యాపారులు బిజీగా మారారు. స్థానిక డైట్ కళాశాలలో ఆదివారం నూతన సంవత్సర ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులు చేసిన పలు నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. నృత్య పోటీల విజేతలకు బహుమతులు అందించారు. అంతకు ముందు కళాశాల ప్రాంగణంలో ఫుడ్‌కార్నివాల్‌లో పలు రకాల వంటకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపాల్ జి.విజయబాబు ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేవీ మహేశ్వరరావు, సూపరింటెండెంట్ పి.అనురాధ, కంప్యూటర్స్ హెచ్‌వోడీలు దాడి భాను, అనిల్‌లు పాల్గొన్నారు.

కశింకోట: మండల గ్రామాల్లోని చర్చిలు సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా చర్చిలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. స్థానిక ఆంధ్ర కల్వరి బాప్టిస్టు సెంటినరీ చర్చిని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. క్రిస్మస్ చెట్టునూ లైట్లతో ముస్తాబు చేశారు. స్థానిక షాలెం మందిర్, గవరపేటలోని ఏసుక్రీస్తు చర్చితోపాటు గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలను అలంకరించి, కొత్త సంవత్సరాన ప్రార్థనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.

దేవునిగుమ్మం వేంకటేశునికి పట్టు వస్త్రాలు


స్వామివారి పట్టువస్త్రాలను తలపై మోసుకొస్తున్న మురళీకృష్ణ

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామికి నూకాంబిక ఆలయం తరపున చైర్మన్ కొణతాల మురళీకృష్ణ కుటుంబ సమేతంగా ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని ఏటా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వస్త్రాలు, పళ్లు, పసుపు, కుంకుమ, పువ్వులను వెంట తీసుకుని మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, ఈవో టి.రాజసులోచనలు వారిని సాదరంగా ఆహ్వానించి స్వామివారి దర్శనం చేయించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబులు ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ, కంటపల్లి శోభారాణి, మల్లవరపు ఈశ్వరరావు, అర్చకులు యనమండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వెలమ కుల వన సమారాధన


అంకంరెడ్డి నారాయణమూర్తిని సత్కరిస్తున్న వెలమ సంఘు సభ్యులు

అనకాపల్లి: వెలమ సంఘ సభ్యులంతా ఐక్యతగా మెలగాలని రాష్ట్ర నవరత్నాల అమలు వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి సూచించారు. మండలంలోని సంపతిపురం స్మార్ట్‌ల్యాండ్ లేఅవుట్‌లో ఆదివారం వెలమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కూండ్రపు భీమేశ్వరరావు(భీమ), కార్యదర్శి లాలం కన్నాజీ అధ్యక్షతన జరిగిన వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెలమ కులస్తులంతా కలిసికట్టుగా ఉండడం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, మండపేట మార్కెటింగ్ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర గణేష్, కాకినాడ వెలమ సంక్షేమ సంఘం కార్యదర్శి రాజాన రాజేశ్వరరావు, వెన్నెల ఈశ్వరరావు, రాష్ట్ర వెలమ సంఘ అధ్యక్షుడు పెదిరెడ్ల సత్యం, సంఘ సభ్యులు చలుమూరి నాయుడుబాబు(గాజువాక), దుర్గాప్రసాద్, అల్లు శంకరరావు, మేదిశెట్టి ఈశ్వరరావు(వేపగుంట), బోకం దేముడుబాబు(మురళీనగర్), సిరికి పోతురాజు, తమటపు కృష్ణమూర్తినాయుడు, గూనూరు మల్లునాయుడు(చోడవరం), జగదీష్, పెదబాబు, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు, వెలమ ఫౌండేషన్ చైర్మన్ మిడతాన వెంకటరమణమూర్తి(నర్సీపట్నం), వైద్యులు, పారిశ్రామికవేత్తలు, నియోజకవర్గ సంఘ సభ్యులు తమరాన బాబులు, రాజాన అప్పారావు, కశిరెడ్డి వాస, మొరుమెళ్ల చందు, కటారి దుర్గారావు, రొంగలి పవన్, నాగిరెడ్డి మురళి, సుమారు 2500 మంది వెలమ కులస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


ఒక చోట చేరిన ఆత్మీయ సంఘ సభ్యులు

అనకాపల్లి: పట్టణంలోని జీవీఎంసీ ఎంజీహెచ్ హైస్కూల్లో 1972–75 మధ్య టెన్త్ పూర్తి చేసిన మూడు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు గ్రేటర్ విశాఖ విలీన గ్రామం కొప్పాకలో ఆదివారం ఆత్మీయ సంక్షేమ సంఘ వన సమరాధాన జరిగింది. ఒకే చోట మూడు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు చేరడం సందడి అంబరాన్నంటింది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులను పరస్పరం పరియచం చేసుకున్నారు. అంతకు ముందు ఏటా వన సమారాధన నిర్వహించుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బల్లా నాగభూషణం, బొడ్డేడ అప్పారావు, పిళ్లా శివ అప్పారావు, దాడి శివరామకృష్ణ, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి చంద్రరావు, పీఎస్ సత్యనారాయణ, మైలపల్లి నూకరాజు, కొత్తూర్తి రామారావు, విల్లూరి సాయి, పొన్నా చల్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో పూడిక తొలగింపునకు చర్యలు


శారదానదిపై కాశీ మదుం గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

కశింకోట: కశింకోట వద్ద కాశీ మదుం గ్రోయిన్ నుంచి వెదురుపర్తికి వెళ్లే సాగు నీటి కాలువలో సొంత నిధులతో పూడిక తీయించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. కశింకోట వద్ద శారదానదిపై దెబ్బతిన్న కాశీమదుం గ్రోయిన్‌ను, సాగునీటి కాలువలను ఆదివారం ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాగునీటి కాలువలో పూడిక పేరుకుపోవడంతో వెదురుపర్తి ప్రాంత పొలాలకు సాగునీరు అందట్లేదని, కాశీమదుం గ్రోయిన్ దెబ్బతిని నీరు దిగువకు వృథాగా పోతోందని, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. దీంతో రత్నాకర్ స్పందిస్తూ తన సొంత నిధులు ఖర్చు చేసి సాగునీటి కాలువలో పూడిక తీయిస్తానని హామీ ఇచ్చారు. బెల్లం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెరకు పంట తెగుళ్లకు గురై ఎదుగుదల లేక దిగుబడి తగ్గి, నష్టం వస్తోందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు పందల ఎల్లయ్యనాయుడు, వేగి దొరబాబు, దాడి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 207 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 419 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.